

# కుమాతా నభవతి

''కుపుత్రుడుండచ్చు గాని కుమాత వుండదు అన్నారు జగద్గురువు శంకర భగవత్పాదులు'' అన్నాడు రాధే శ్యామ్.

''నేను ఒప్పుకోను. కుమాతా వుంటుంది. సుపుత్రుడుంటాడు. సుపుత్రుడు చెప్పినట్టు వినక ఆపదలపాలూ అవమానాలపాలు అవుతుంది తల్లి. అయినా పుత్రునికి తల్లిమీద ప్రేమా గౌరవమూ పోవు. శాయశక్తులా తల్లిని కాపాడాలనే చూస్తాడు. కాని పుత్రుని విలువ గుర్తించక వాని సేవలను తిరస్కరించి నికృష్టపు చావుకి గురౌతుంది తల్లి. నేను కళ్లారా చూచాను'' అన్నాడు సీతారాం.

''బహుశా ఆ తల్లి వృద్ధురాలే గాక మతిచలించినదై వుంటుంది'' అని తార్కికుడు రాధేశ్యామ్ వాదిస్తున్నట్టే చూశాడు మిత్రుని వంక. అలా అని వూరుకోక, ''తనకు తాను హాని చేసుకున్నది గాని ఆ తల్లి పుత్రునికేమీ హానిచేయలేదని గమనించాలి'' అన్నాడు నిదానంగా.

''నీ తర్కానికేంలే, గౌతమ బుద్ధుడు గూడా తర్కంతోనే గెలుచుకొచ్చాడని కథలున్నాయి. నీవన్నది నిరూపించాలి'' సైకాలజీ ప్రొఫెసర్ సీతారాం అన్నాడు.

''తర్కించటం లేదు మిత్రమా. ఆ తల్లికొడుక్కి హాని చేయలేదని నిరూపించాను. నీకు వాదించకుండానే అంగీకరిస్తే ఓడిపోయినట్లే అని భావన నిరూపించగలను గనకే జగద్గురువుతో ఏకీభవించాను''. తొణక్కుండానే అన్నాడు తార్కికుడు.

''నిరూపణ అంటే కథల్లల్లటం గాదు మిత్రమా'' అని నవ్వాడు సీతారాం.

''అల్లిక గాదు, నిజమే''.

## 2

నరసమ్మ గొప్పింటి బిడ్డ. దేవుడు తన లీలలో ఒక భాగంగా అంతా లాగేస్తే, భర్తపోగా, వున్నకొద్ది భూమితోనే కాలం నెట్టుకొస్తున్నది. బిడ్డలు చేతికంది రావాలి. అందాకా తన తెలివితేటలు వాడాలి. మరొక యిబ్బంది. నరసమ్మకు హైపర్ టెన్షన్ వున్నదని ఆమెకు తెలియదు. తెలిస్తే దాన్ని కంట్రోల్ చేసే ఔషధం వాడేది.

సుపుత్రుడు చదువబ్బక, డబ్బు లేక, చేయగలిగినపని చేస్తూ డబ్బు కంట జూస్తుంటే, ఆ డబ్బు తల్లి కంటబడగానే, ''చెడిపోతాడనో దూబరా చేస్తాడనో'' సదుద్దేశంతోనే, ఆ డబ్బు వడేసి లాగేసేది. పాలుపోసే పున్నమ్మ నరసమ్మ యీడుదే, ''బిడ్డల సంపాదన తల్లిదండ్రులది కారాదమ్మ గారూ. హోటలు తల్లి సినిమా తండ్రీనూ'' అని నవ్వింది. ఆ మాటాలు నచ్చాయి నరసమ్మకి. దాని పేరే దూబరా అని వుద్దేశం.

కొన్నాళ్లైంది. ''యీ తల్లి నా స్వంతానికేమీ మిగల్చకుండా అంతా లాగేస్తున్నది'' అని గమనించిన సుపుత్రుడు, అందకుండా కంటబడకుండా తిరగసాగాడు.

''భోజనానికి రావటం లేదు పుత్రుడు'' అని చూసింది తల్లి. టెన్షన్ హెచ్చింది. అంతా లాగేస్తున్నాననీ పోకెట్ మనీ అన్నా వదలటం లేదనీ తలచలేదు.

వెతికివేసారి సుపుత్రుని, దాయాది అన్న వీధరుగు మీద కనుగొన్నది. ఆదాయాది అడ్వొకేట్. మంచి గుమస్తా అందక అవస్థపడుతూ, యీ దాయాది

తమ్ముని యిల్లు చేరకుండా తిరుగుతున్న వానిని, మంచి మాటలతో చేరదీసి, పని నేర్పి, గుమస్తాగా పెట్టుకున్నాడు. కారు కడగటం, కారుతోలటం నేర్పాడు. తనకు తోచినంత యివ్వగలిగినంత తమ్ముని చేత పెడతాడు. యెటువంటి కేసుపడితే యెంత శాతమివ్వాలో వ్రాయించుకోలేదు తమ్ముడు. తెలియదు. అనుభవం లేదు. అడ్వొకేటేమో కేసు వివరాలు విని శాతం చెప్పేస్తాడు కక్షిదారుకి. రాయించుకుంటాడు గూడాను.

ఆ రోజున అడ్వొకేట్ రాజధానికి వెళ్లాడు. ఆదివారం. కారుబాటరీ డౌన్ కాకుండా, నాలుగు రోడ్లు తిప్పి తెచ్చి కడిగి తుడిచి షెడ్లో వుంచి షెడ్ తలుపు బిగించాడు సుపుత్రుడు. వదినె డెలివరీకి పుట్టింటి కెళ్లింది. వంటాయన రాడు. అన్న వచ్చాకే వస్తాడు. జేబులో చిల్లరన్నా లేదు. రాత్రి పేకాటలో కోల్పోయాడు. అన్న వెంట క్లబ్‌కి వెళ్లటం అలవాటైంది. ఆకలికి సొమ్మసిల్లి, అరుగుమీద వత్తిగిల్లి, తలకింద చేయి పెట్టుకుని పడుకున్నాడు.

తల్లి కుదిలింపుకి కళ్లు విప్పాడు సుపుత్రుడు.

''వెతుక్కుంటూ వచ్చావూ? వస్తాననే చూస్తున్నావే'' అని నవ్వుతూ లేచి కూచున్నాడు.

''అన్నం నీళ్లూ లేకుండా దాయాదుల అరుగుమీదపడుకున్నావేం? తల్లిని గదా! వెతకనా? తిన్నాడో తినలేదో ఆకలికి అలమటిస్తున్నాడేమోనని తల్లడిల్లనా, లేచిరా'' అని చెయ్యిపట్టుకు లాగింది తల్లి.

లేచి తల్లి వెంట నడిచాడు సుపుత్రుడు. ఇంటికి చేరగానే, స్నానానికని వేడినీళ్లు, యిస్త్రీ తువాలు, సబ్బు ధోవతీ అందించింది తల్లి. ఆ పనికాగానే

తలతుడుచుకుంటూ వంటింట్లో కెళ్లాడు. పీటా, దాని ముందు విస్తరీ, విస్తట్లో ఘుమ ఘుమ లాడే పదార్థాలూ, పక్కనే చల్లని మంచి నీళ్ల గ్లాసూ, దోసకాయ చెంబుతో మంచినీళ్లు.

పీటమీద కూచుని, ఔపోసన పట్టి, తల్లి అభిగలించాక రెండు మెతుకులు నోట్లో వేసుకుని కళ్లకద్దుకున్న అన్నం తినసాగాడు. కమ్మని నేయి వడ్డించింది.

భోజనమైంది. ఉత్తరాపోశనం పట్టాడు. లేచాడు. చేయి కడుక్కుని, తుడుచుకుంటూ, త్రేనుస్తూ వచ్చాడు. మంచం ఆహ్వానించింది. కళ్లు మూతలు పడుతున్నాయి.

కొద్దిసేపటికే తల్లి వచ్చి పక్కగా కుర్చీలో కూచుని వ్యవహారమెత్తింది.

''యేదో వుద్యోగం వెలిగిస్తున్నావని సంతోషిస్తే దాయాదుల పంచన ముడుచుకుని పడుకున్నావేం? అలా చూస్తాననుకోలేదు'' అని ముక్కు నలుపుకుంటూ విచారం వెలిబుచ్చింది.

''మదుపు పెట్టనిదీ యే వుద్యోగమూ వరించదు. అదీగాకపోతే గట్టి శిఫారసు తెచ్చుకోవాలి. ఆ రెంటికీ గూడా డబ్బు చూపాలి. అన్నే పిలుచుకు వెళ్తే వెళ్లాను. నేనేమీ జీత భత్యములు ఒప్పందం చేసుకోలేదు''. ఇంటి కప్పువంక చూస్తూ అన్నాడు. గుండెల మీద చేతులు కలిపి పెట్టుకున్నాడు. ఒక కాలిమీద ఒక కాలు వేసి, వెల్లికలా పడుకుని పాదాలు ఆడిస్తున్నాడు.

''పోనీ పెట్టుబడి పెట్టుకుని స్వంత వ్యాపారం నడుపు. వారి వీధరుగు మీద కన్నా అది నయం. కాపలా పెట్టి వెళ్లాడా దాయాదీ?''.

కళ్లు బాగా విప్పి తలతిప్పి తల్లి వేపు చూశాడు. నవ్వుతున్నాడు ''డబ్బేదీ పెట్టుబడికీ? నువ్విస్తావా? వ్యాపారం నడుపుతాను'' అన్నాడు సుపుత్రుడు.

''పొలముందిగా. అమ్మి పెట్టు. నడుపు. లాభాలు రాగానే మళ్లా కొనుక్కుందాము'' అన్నది దిలాసాగా.

మళ్లా నవ్వాడు ''మైనర్లున్నారు. హక్కులేదు పిత్రార్జితం గదూ'' అన్నాడు గాని, వ్యాపారం పెట్టను, లోతుపాతులు తెలియవు అనలేదు. మనస్సు అప్పుడే పురకలు వేస్తున్నది.

''నే సంతకం చేస్తే అమ్మొచ్చు. నా పేర వ్రాశారు మీ నాన్న. మైనర్ల సంగతి మనం చూడమా, గాలి కొదిలేస్తామా?'' అని ప్రోత్సహించింది తల్లి.

అట్టి సమయంలో తల్లి తత్త్వం సుపుత్రుడు మరిచాడు. సుపుత్రుని సైకాలజీ తల్లి మరిచింది. ఇద్దర్నీ మాయ ఆవరించింది.

3

దాయాదులే కొనగా పిత్రార్జితం చేయిజారిపోయింది. మాగాని భూమి. రెడీమేడ్ దుస్తులూ, ఖాదీభండార్ వ్యాపారం నడపసాగాడు పుత్రుడు. కొన్నాళ్లు కళకళలాడుతూ పరుగెత్తింది వ్యాపారం. ఒక సేల్స్ గాళ్, ఒకబ్బాయి పనిలో కుదిరారు.

పెళ్లి సంబంధాలు వచ్చాయి. తల్లికి నచ్చక కొన్నీ సుపుత్రుని అంగీకారం మెప్పు పొందక కొన్నీ తిరిగిపోయాయి. సుపుత్రుడే యెన్నిక చేస్తే బాగుండేది. తోడు నీడ వుండేది.

మళ్లా తల్లి అలవాటుకి తట్టుకోలేక చిరాకు పడసాగాడు. చేతులో డబ్బు నిలవనివ్వదు. యెప్పటిదప్పుడు లాగేస్తుంది. లెక్కలు చూపమంటుంది.

స్నేహితులేర్పడ్డారు సుపుత్రునికి. పేకాట, సిగరెట్టు, తాంబూలం, కాఫీ ఫలహారం షాపులోనే అమరేట్టు చూసుకున్నాడు పుత్రుడు. ఇంటి ముఖం చూడటం తగ్గించాడు. క్లబ్ మెంబరైనాడు. వెళ్తే అర్ధరాత్రి వరకు పేకాట ఆడి, యిల్లు గుర్తొచ్చినట్టు వెళ్తాడు.

చేతులో డబ్బు పోస్తాడు, ఆ లాభాలతో ప్రైవేట్ బిజినెస్ నడుపుదామని, చౌకగా పొలాలు అమ్మేతున్నారని విని మళ్లా కొనుక్కుందామని ఆశిస్తున్న తల్లికి నిరాశే మిగిలింది.

ఒకటి రెండు సార్లు హెచ్చరించింది 'పెట్టుబడి పెట్టింది నేను. అది మైనర్ల ఆస్తి అని నువే అన్నావు. గుర్తు చేసుకో. గడియారాలు అమ్మిపెట్టమని షాపులో వుంచి వెళ్తున్నారని తమ్ముడు చెప్పాడు. అదివిని సంతోషిస్తే షాపులో వుండటం లేదనీ, స్నేహితులు ,క్లబ్బూ నిన్ను పట్టారని వింటున్నాను. పనివారి మీద వదిలేసి వెళ్తే, వాళ్లు నిజాయితీగా వుంటారా?'' ఆ గొంతులో సాధింపు వినిపించింది పుత్రునికి ''పోనీ పెళ్లి చేసుకోవు'' అని దెప్పింది. విసుక్కున్నది. నవ్వుతున్నాడు సుపుత్రుడు. ''అంటే పెట్టుబడి పెట్టింది నీవు గనక, కో ఆపరేటివ్ సొసైటీ కొట్లో క్లర్క్‌లాగా, యే రోజుదారోజు నీ కప్పగించి, చేతులు తుడుచు కోవాలన్న మాట. పెళ్లా? నన్ను వాడుకుంటున్నట్టే, నా పెళ్లాన్నీ వాడుకుంటావని, చేసుకోటం లేదు. అదే నీ ఆలోచన'' అలా అంటూనే అర్ధరాత్రి ముంచుకొచ్చిన నిద్రలోకి జారిపోయాడు సుపుత్రుడు.

''వేరే మార్గం చూడాలి. వీడి చేతిలో డబ్బు పోయటం పొరపాటే. చెపితే వినేట్టు లేడు'' అని ఆలోచిస్తూ తల్లి లేచి వెళ్లింది.

4

''కొండనాలిక్కు మందేస్తే వున్న నాలుక వూడిందని సామెత. అలాగా సంపాదనంతా నా చేతులలో పోస్తే నేను ప్రైవేట్ ఎంటర్‌ప్రైజెస్ నడుపుదామనుకొని, యీ సుపుత్రుని ప్రయోజకునిగా చేయాలని చూస్తే, నెత్తిమీద పిడుగుపడినట్టు యిలా అయిందేం? యేం చేతునూ? సుపుత్రుడూ అయిపు లేడు. చేతిగడియారాలూ పోయాయట. కొట్టు పై కప్పుకి కన్నం వేసి కొట్లోకి దిగారన్నాడట. ఆ గడియారాల ధర చెల్లించమని, పోనీ నాలుగోవంతు డబ్బైనా చెల్లించమని, కోర్టుకెందుకనీ మంచిగా అడిగితే మొండిచేయి చూపాడట పుత్రుడు. అరెస్టు చేయంచబోతున్నారని స్నేహితులు వార్త చెబితే మాయమైనాడట సుపుత్రుడు. నా మీద కొచ్చారెక్కడ దాచావని. నేను చెల్లించాలన్నారు. యెక్కడ నుంచి తేను? కాస్తా కూస్తా గాదు పాతికవేలు?'' అని దుఃఖించింది నరసమ్మ తల్లి. రెండు కొట్లు తాళం వేశారు. కొంతైనా రాబట్టాలని వేలం వేశారు. కొట్లు అద్దెకిచ్చిన ఆసామియే నేర్పుగా వీలైనంత తక్కువ ధరకి తన పేర కొట్టేయించుకున్నాడు వేలంలో. తాళాలు తీయించాడు. ఇంకో నేరం బైట బెట్టాడు. మూడు నెలల నించీ అద్దె చెల్లించలేదట సుపుత్రుడు. మరోసారి యేడిచింది నరసమ్మ తల్లి.

మతి పోగొట్టుకోక, ధైర్యం కూడదీసుకుని, మరో వూరిలో వున్న తన పింతల్లి భ్రమరాంబ యింట్లో దింపింది మైనర్లని. భ్రమరాంబకి సంతులేదు. భర్త పోయాడు. ఆస్తి వున్నది. బాంక్‌లో డబ్బున్నది. స్వంత యిల్లున్నది పింతల్లికి.

పింతల్లి అత్తవారే పెంపకం చేయించారు. పెంపుడు కొడుకు శ్రీరామ్ బుద్ధిమంతుడే. చదువుపూర్తి చేస్తూనే వుద్యోగంలో చేరాడు. పింతల్లి మంచి సంబంధం చూసి పెళ్లి చేసింది. కోడలు సౌందర్య చక్కనిదే బుద్ధిమంతురాలు. కాని సంతానం కలగలేదు. వైద్యం చేయించారు. ఆపరేషన్ చేయించారు. నోములు వ్రతాలు, ప్రదక్షిణలు, పూజలు, మొక్కుకోటం జరిగాయి. కాని నలుసు కంటబడనే లేదు పింతల్లికి. తనవేపు పిల్లల్ని తెచ్చి పెంచుతూ వుంటుంది భ్రమరాంబ పిన్ని.

''వీళ్లిద్దర్నీ యిక్కడుండనీ పిన్నీ. సుపుత్రుడు దగా చేసి కొంపముంచాడు. ఐపూలేడు. ప్రయత్నించి ఆదరువు అందగానే వచ్చి తీసికెళ్తా. కామూ సోమరిగాదు. యింటి పని చేస్తుంది. జగ్గ బజారు పని చేసి పెడతాడు. పని చెప్పి చేయించుకో పిన్నీ. సుపుత్రుడిలా చేస్తాడనుకోలేదు'' అని కళ్లు తుడుచుకున్నది. కొంగువిప్పి కొంచెం డబ్బు దేవుడి పీటమీద వుంచి దణ్ణం పెట్టింది. అమ్మగలిగినవన్నీ అమ్మగా వచ్చిన డబ్బు అది.

పిన్నితో మాట్లాడుతుండగా తన మేనత్త శాంతమ్మ పెద్దదై, మెడపడిపోయి, కీళ్ల నెప్పులతో మంచాన పడిందని తెలిసింది.

''చూసి వస్తా పిన్నీ. మేనత్తగదూ'' అని వెళ్లిపోయింది.

మేనత్త శాంతమ్మకి సాయమెవరూ లేరు. పాలేరు, పనిమనిషి రంగమ్మ, పూజారి కొడుకు బాలయ్య, కోడలు వేరింటి కాపరం పెట్టించింది. మనమడు పట్నంలో పెద్ద చదువు చదువుతున్నాడు. మనమరాలు అత్తింట్లో వున్నది. కూతురూ అల్లుడూ దుబాయ్‌లో వున్నారు.

వెళ్తూనే మేనత్త సేవ, వంటా అందుకున్నది నరసమ్మ. బొమికల డాక్టరుకి

చూపిస్తే మెడకు కాలర్ వేస్తే తగ్గిపోతుందన్నాడు. ఆ పని అయింది. విటమిన్ బి కాంప్లెక్సు యింజెక్షన్సు యిప్పిస్తూ టానిక్ వాడితే కాళ్లు పనిచేస్తాయి అన్నది డాక్టరమ్మ. అదీ మొదలు పెట్టించింది. ఉపచారం చేస్తుంది.

''ఇల్లంతా పడిపోతున్న దత్తయ్యా. కొడుకు రిపేర్లు చేయించ లేదూ?'' అని సానుభూతి చూపింది.

''నా ఆలి సంగతి నేనెరగనా అన్నాడట నరుసూ. నా కొడుకు సంగతి నీకు తెలియదూ? యేమీ పట్టించుకోడు. పెళ్లాం ముద్దు ముచ్చట్లకీ, పిల్లల చదువులకే వాడి సంపాదన చాలటం లేదట. నేనే అందించాలట. నాకు జవసత్వాలుడిగి పోయాయే నరుసూ. యేదో నీ వొచ్చి యింత తినిపిస్తూ ఉపచారం చేస్తే లేచి తిరగగలుగుతున్నా. నీ సంగతి విన్నా. మంచంలో వుండి రాలేక పోయినా. దేవుడల్లే నీవే వచ్చావు'' అన్నది మేనత్త శాంతమ్మ.

రెండు ఆవులూ, రెండు గేదెలూ, పొలమూ, యిల్లూ వున్నాయి. మానేజ్ చేయాలి.

నరసమ్మ కబుర్లు చెబుతూ యిల్లు బాగు చేయించింది. రంగులేయించింది. లైట్లు వెలిగినై. తమకుంచుకుని, మిగిలిన పాలూ పెరుగూ వెన్నా నేయీ సొసైటీ వారి కమ్మింది. మేనత్త సంతోషించింది.

''నరసూ నా తల్లే. ఇల్లు భవంతిలాగా చేశావు. నాదగ్గరే వుండు. పిల్లల్ని తెచ్చుకో. ఈ వూళ్లో చదువుతారు'' అని సంతోషంగా చెప్పింది. లేచి తిరుగుతూ తన పనులు తాను చేసుకోగలుగుతున్నందుకు సంతోషించింది.

5

''నరసమ్మా! కంట్రాక్టరు వైనట్లున్నావే, బిజీగా కనిపిస్తున్నావు. బాగా పరపతి పెరిగింది నీకు. వైద్యం గూడా చేస్తున్నావా? అదీ ఆదాయమిస్తుందా? కామేశ్వరికి సంబంధాలు చూస్తున్నావా? జగ్గు చదువై పోయిందా? వుద్యోగంలో కెళ్లాడా?'' అని యోగక్షేమం అడుగుతూ కుర్చీలో కూచున్నాడు వేలువిడిచిన మేనమామ చంద్రశేఖరం గారి కొడుకు యాజులు.

''కాళ్ళు కడుక్కో బావయ్యా. అంతా బావున్నారా? అక్క సుందరి లేచి తిరుగుతున్నదా?'' అని నీళ్ల చెంబుకిందవుంచింది నరసమ్మ.

భోజనం వేళైంది. స్నానం చేసి భోజనానికి కూచున్నాడు యాజులు. ఇద్దరూ కష్టసుఖాలు చెప్పుకున్నారు.

''నీ సంగతి విన్నాను నరుసూ. రాలేకపోయినా. నేనూ యిబ్బందుల్లోనే వున్నా. కూతుర్ని గొప్ప సంబంధమని పట్నంలో యిచ్చానా? కట్నం కానుకలు లాంఛనాలు మర్యాదలతో తడిసి మోపెడైంది. అప్పులు చేశా. తీర్చాల్సి వచ్చింది. కొడుకు విదేశం వెళ్లి అక్కడే పెళ్లాడాడు. మీ అక్క దిగులుపడి జబ్బు పడింది. వైద్యం చేయించాను. నా ప్రాక్టీసు, ఆమె సంగతీ, కూతురు సంగతీ మిణగానాం తేలానాం అయింది నరుసూ. సుందరికి ఫిట్సు గూడా వస్తున్నాయి. కాపలాకని ఆడమనిషిని పెట్టాను'' అన్నాడు సానుభూతి కోరుతూ.

''అయ్యో పాపం! బావయ్యా. నన్ను పిలిపించక పోయావూ? వచ్చేదాన్నే. నాకు తెలియదు. యేం పనిమీద వచ్చావూ యీ వూరు?'' మారు వడ్డన చేస్తున్నది.

''సంబంధాలు చూసిపెట్టమని నా స్నేహితులడుగుతున్నారు.

బుద్ధిమంతుడు పిన్నవయసు వాడూ కావాలిట. జగ్గు గుర్తు వచ్చాడు. నువ్విక్కడున్నావని విని వచ్చాను'' అన్నాడు.

''జగ్గుకింకా వుద్యోగం రాలేదు. కామేశ్వరికి కట్నం పోయలేను. యేదో నలుగురితో మంచిగా వుండి నెట్టుకొస్తున్నాను బావయ్యా'' పెరుగువడ్డిస్తూ అన్నది నరసమ్మ.

''మామగారే యిప్పిస్తాడుట. నేనూ చూసిపెడతా. మునిసిపాలిటీలో గాని, లైఫ్ ఇన్సూరెన్సు సంస్థలో గానీ యిప్పిస్తే లాభం. ఇపుడు కొన్ని స్కీములొచ్చాయి. నువ్వు వినలేదేమో నరుసూ!''.

''యేమిటవీ?'' నరసమ్మకి కుతూహలం వుత్సాహం కలిగాయి.

''సెల్ఫ్ యెంప్లాయ్‌మెంట్ స్కీమ్ కింద అప్పుయిస్తారు. వ్యాపారం చేసుకుంటూ నిదానంగా తీర్చేయవచ్చు''.

''వ్యాపారం అచ్చిరాలేదు బావయ్యా. అనుభవించే తెలుసుకుని చెప్తున్నా. యెవరికైనా యిస్తారా?'' అన్నదాలోచిస్తూ.

'' ఆ. ఆ. నీకూ యిస్తారు. హామీ తెచ్చుకోవాలి. నేనుంటా. నీ సమర్ధతా తెలివి తేటలూ తెలిశాయిగా'' అన్నాడు ప్రోత్సహిస్తూ.

''నువ్వుంటావా?'' అని నవ్వింది నరసమ్మ.

''నువ్వడగాలిగానీ, నీకే యిప్పిస్తా. మిన్ను విరిగి మీద పడినా చలించవు'' అన్నాడు. భోజనమైంది. లేచాడు.

''పొగిడితే పొంగే వయసు గాదు బావయ్యా నాదీ'' అని తానూ లేచింది.

''మున్సిపాలిటీ భూములిప్పిస్తారు. యిల్లు కట్టుకోటానికి అప్పులిప్పిస్తారు బాంకు వారి చేత. అట్టి పన్లు పిల్ల నివ్వదలచినవాడు చేసి పెడతాడు. నేను కట్నం మాటెత్తలేదే నరుసూ'' అంటూ దొడ్డి వేపు వెళ్లాడు యాజులు.

వెనకనించే అడిగింది నరసమ్మ ''రెండోదో మూడోదో నాలుగోదో సంబంధమా? సంతానమున్నదా?''

చేయీ మూతీ కడుక్కుంటూ యిటు చూడకుండానే అన్నాడు యాజులు. ''లేదు. లేదు. మొదటిదే''.

యింట్లో కొస్తున్న బాలయ్య వంకే చూస్తూ అన్నది.

''యేదన్నా వైకల్యమున్నదేమో. లేదా వేరే వర్ణమేమో. వర్ణాంతరం వివాహానికీ, వైకల్యమున్న వారిని వివాహమాడితే ప్రభుత్వం వేలల్లో యిస్తారని విన్నాలే బావయ్యా'' అలా అంటూ పోయి వక్కపొడి పొట్లం తెచ్చి అందించింది నరుసు.

''అన్నీ తెలుసుకునే పిల్లనిద్దువు గాని. బలవంతమేమీ లేదు. మోసమూ లేదు నరుసూ. వద్దంటే మానేస్తా. నాకు వచ్చేదీ లేదూ పోయేదీ లేదు. నాది నిష్కామ కర్మ'' అని నవ్వుతూ వక్కపొడి వంచి నోట్లో వేసుకున్నాడు యాజులు.

6

నరసమ్మ తన తెలివితేటలతో మైనర్లని మేజర్లు చేసి, పెళ్లీ పేరంటం చేసింది. నేర్పుగా తన ప్రైవేట్ ఎంటర్‌ప్రైజెస్సూ నడుపుతున్నది. ఇల్లూ పొలమూ ధైర్యాన్నీ సంతోషాన్నీ యిచ్చినై.

సుపుత్రుడు అడపాదడపా వస్తూ పోతూ కంటబడుతూనే వున్నాడు. కన్న కడుపు గదూ రావద్దనలేదు. తరిమి వేయలేదు. చేతులో సమయానికుంటే అడిగితే డబ్బూ సుపుత్రుని చేతులో పోస్తుంది నరసమ్మ. అంతటితో కడుపు తీపి ఆగిపోలేదు. సుపుత్రుడు పీపుల్స్ వార్ గ్రూప్‌లో చేరి ప్రొఫెషనల్ గాదు గనక, అమెచూర్లాగా అరెస్టయి పోలీసులచేత లాఠీ దెబ్బలు తిని, యెముకలు విరిగి, ఠాణాలో వున్నాడనీ, వారు పతా అడిగితే తల్లి పేరు చెప్పాడనీ వార్త అందగానే, సమర్థులను కూడగట్టుకుని, నిర్దోషి అనిపించి ఠానా నుండి యింటికి తెచ్చింది. సేవజేసి, పోషణ చేసి, వైద్యం చేసి మామూలు మనిషిని చేసింది. అదుగో అప్పటినుంచే సుపుత్రుడు తల్లినంటిపెట్టుకుని వున్నాడు.

''బాగా సంపాయించుకున్నదే నా తల్లీ! సిరిసంపదలొచ్చాయే'' అని నవ్వుకున్నాడు.

కాని మళ్లా క్రైసిస్ తెచ్చాడు సుపుత్రుడు.

''వాడినెందుకమ్మా తెచ్చి నెత్తినెక్కించావూ? కడగాపోయే శనేశ్వరమా కాలి మీదిగా పోవే అన్నట్లున్నది నువ్వు చేసిన పని. గతిలేని వాళ్లను చేసి యెటో వెళ్లిపోయాడు. బుద్ధిగా నువ్వు చెప్పినట్టు విని, నడుచుకున్న నన్ను దూషిస్తున్నాడు. మరదల్ని తప్పుపడుతున్నాడు. చదువు చెప్పే మిషతో, బాగా చదవటం లేదని, తమ్ముడి పిల్లల్ని బాదుతున్నాడు. మరదలిమీద చెయ్యి చేసుకుంటున్నాడు. వాడికి డబ్బు గూడా అందిస్తున్నావూ. తిని కూచోకపోతే సంపాయించి ఖర్చు చేసుకోలేడా? వేరే వుండవచ్చునే? పెళ్లాడవచ్చునే? ఇల్లరికం యిమ్మని అడుగుతున్నారే'' అన్నాడు కొడుకు జగ్గూ.

'' ఆ పెంకి పెళ్లాన్ని కంట్రోల్ చేయటం నీకు చాతగావటం లేదురా దద్దమ్మా. దానికి వీపు చిమచిమలాడుతుంది. దేహశుద్ధి చేస్తే ఆరోగ్యం కుదురుతుంది'' అని నవ్వాడు సుపుత్రుడు. నరుసు తల్లి, ''వాడూ కన్న కడుపేగా'' అని గొణిగింది.

''తినీ తినకా తిరుగుతూ దాయాదుల పంచనబడివుంటే చూడగలనా'' అని గొణుగుతూ వెళ్లిపోయింది.

కాని సుపుత్రుడు తన ప్రతాపం తల్లి యెదుటే చూపాడు.

మరదలి జుట్టుపట్టుకు వంగదీసి గుద్దుతుంటే తమ్ముడు విడదీసి అడ్డం వచ్చాడని వాడిని కొట్టినెట్టితే జగ్గూ కిందబడి లేచి నించుని, వళ్లు దులుపుకుంటూ, యెర్రబడి నీళ్లు నిండుతున్న కళ్లతో తల్లిని చూస్తూ అన్నాడు.

''అమ్మా! పోతాము. సత్రంలో పార్ట్ టైమ్ గుమస్తాగా పని అందింది. రెండు గదులిస్తారు. పోతాము. నా నిజాయితీ తెలిసే యిచ్చారు. తమ్ముడని ముద్దుజేసి పెద్ద చదువుచదువుదువుగాని అని సంతోషపెట్టే కుమారస్వామి అన్నయ్య స్టూడెంట్సు అల్లర్లలో గుండు తాకి పోయాడు. పిత్రార్జితం అమ్మి వ్యాపారం వేలం వేయించగలిగిన వాడున్నాడు నన్ను బాదటానికి'' అని కళ్లు తుడుచుకున్నాడు.

ఆ రోజెవరికీ తిండి లేదు.

మరునాడు సాయంత్రం నరుసు తల్లి కొడుకు జగ్గూనీ వాడి ఫామిలీని, సామానునీ, వన్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లోకి మార్చి, అన్నీ సర్దిపెట్టింది.

''జగ్గూ! ఇది నీకోసమే కొన్నాను. బిల్డింగ్ మొదలు కాగానే బయానా చెల్లించాను. నువ్వల్లా యింటి పన్ను చెల్లించుకోవాలంతే. వాడితో ప్రమేయం వుండదు. నాకు తప్పదు. నేను వెళ్తున్నా. వచ్చి చూసిపోతువుంటా'' అని కన్నీరాపుకుంటూ వెళ్లిపోయింది.

7

నరసమ్మ తల్లికి, శ్రమ యెక్కువై వయసెక్కువై, చూపు మందగించి, తాను తిని సుపుత్రునికి పచ్చడి మెతుకులు విదిలించ సాగింది.

'' ఇదేం తిండీ? నీకు కళ్లు కనపడటంలా. నే చేస్తా వంట నువ్వు నీ బిజినెస్ చూసుకో. కిరాణా తెస్తా డబ్బియ్యి. పని మనిషి చాలు'' అన్నాడు సుపుత్రుడు నవ్వుతూ.

''అదే మంచి పని'' అన్నది తల్లి. ''దాయాదుల పంచన ముడుచుకు పడుకునే కన్న స్వంత యింట్లో వంట చేసుకోటం మర్యాదే'' అని గొణిగింది.

సంక్రాంతికి కూతురు వచ్చింది. అన్ని పన్లు అందుకున్నది. వంట చేసి పెట్టింది. బట్టలారేసింది.

కూతుర్ని పరిశీలించిన తల్లి ''నగలేవే తల్లీ'' అనడిగింది.

''చిన్న జీతగాడు గదమ్మా అల్లుడు. పిల్లల చదువులూ, రోగాలు, వైద్యం చాలక అత్త వారొస్తే మర్యాదలూ డబ్బుడిగారు'' అని తల వంచుకుని, వంటింట్లో దేముడి ముందు దీపముంచటానికి వెళ్లింది కూతురు.

గాజులు గొలుసూ చేయించి కూతురు వంటి మీదుంచింది నరసమ్మ.

''ఇవెందుకమ్మా! నకిలీవి చాలు. నీ కష్టార్జితం నా కెందుకు? పిత్రార్జితం మీది ఆదాయమైతే అదొ కసంతోషం. ఆడదానివై పుట్టి, అన్ని కోల్పోయి గూడా, ధైర్యం కోల్పోక, తెలివి వెచ్చించి, పిల్లల్ని కాపాడి పెళ్లీ పేరంటం చేశావు. ఇంకా నీ దగ్గర్నించి తీసుకోనా? వద్దు'' అని తీసి తల్లి ముందుంచింది కామేశ్వరి.

''యేదో దేవుడాయుర్దాయమూ తెలివితేటలు యిచ్చాడు. మీకేమైనా చేయగలిగాను. పోతానేమో. దృష్టి బాగాలేదు. నేపోయాక సుపుత్రుడు చెల్లెలని నీ యింటికి వస్తాడేమో అన్నం పెట్టి పంపించేయి తల్లీ. తీసుకోమ్మా'' అని వాటిని మళ్లా కూతురు వంటి మీద పెట్టింది తల్లి.

8

సుపుత్రుడు, ''దర్జాగా బతకాలి. లేనివాళ్లమా?'' అని మంచి ఫర్నిచరు, టి.వి., టెలిఫోను, విద్యుద్దీపాలు అమర్చాడింట్లో. బంధువుల రాకపోకలు సాగిన్నై. అందులో ఒకడు కంప్యూటర్ కొనిపించి లెసన్స్ యివ్వసాగాడు.

నరుసు తల్లి పడకవేసింది. దృష్టీ పోయింది. శుక్లాలు తీయించాలి. సుపుత్రుడు కనిబెట్టి చూస్తూ రోజులు లెక్కిస్తున్నాడు.

ఇపుడు నరసమ్మ తన ప్రైవేట్ సంస్థ నడపటం లేదు. ఆదాయం లేదు. వ్యయమే. ఆమె కొనుక్కున్న చిన్న సైజ్ గోద్రెజ్ బీరువాలో రొఖ్ఖమున్నది. దాని తాళం చెవి సుపుత్రుని రొంటిన వేలాడుతూ వుంటుంది.

వేడుకగా కంటి డాక్టర్ని తెచ్చాడు. ఉచిత కంటి వైద్య శిబిరానికి తీసికెళ్లాడు తల్లిని. అది గొప్పవారి క్లబ్. అప్పుడప్పుడు ఉచితంగా కంటికి శుక్లాలు తీసే శస్త్ర చికిత్స చేస్తారు డాక్టర్ మెంబర్లు. వారు చూచారు.

''బాగా ముదిరాయండీ శుక్లాలు. వయసూ యెక్కువే మీ అమ్మగారికి. అవితీస్తే మెదడులో నరాలు దెబ్బ తినవచ్చు మూడు నెలలలోపే బ్రెయిన్ పనిచేసే శక్తి కోల్పోతుంది. మీ తల్లిగార్ని అలా వుండనీయండి. చాలా సంపాయించుకున్నారు. మీరామెని అంటిపెట్టుకుని వున్నారు'' అని పంపేశారు.

నరసమ్మ తల్లి కాలధర్మం చెందింది. రావల్సిన వారంతా వచ్చారు. అపరకర్మలు, సుపుత్రుడు మాతృయజ్ఞం లాగా ఘనంగా శాస్త్రీయంగా చేశాడు. పధ్నాలుగో రోజున యజ్ఞం పూర్తి అయి, యిల్లు నిశ్శబ్దమైంది.

అపుడు సుపుత్రుడు తల్లి కట్టించుకున్న చిన్న మట్టసమైన యిల్లూ, దాని స్థలమూ రెండు లక్షలకు బేరం పెట్టాడు. ఆ డబ్బు చేజిక్కించుకుని, ఆంధ్రప్రదేశ్ రాజధాని చేరి, కంప్యూటర్ యెకాడమీ నడపాలనీ, లక్షల్లో లాభాలు, గంటకు నూరు చొప్పున ఛార్జ్ చేస్తూ మెషీన్లు నడపాలనీ పధకం వేశాడు.

కాని పెద్ద వింతే యెదురు చూడాల్సి వచ్చింది. పొలం యిల్లూ మంచి ధరలు పలికాయని తల్లి నరసమ్మ క్రిందటేడాదే అమ్మేసింది. అప్పటికి చూపుపోలేదు. బ్రెయిన్ పదునుగా వున్నది. మాట బాగా వినబడుతున్నది. వీలునామా వ్రాయించింది. సాక్షి సంతకాలు పెట్టించింది తల్లి. తాను పోతే బీరువాలోని మిగిలిన రొఖ్ఖం సుపుత్రునికి చెందును.

మండిపోయింది సుపుత్రునికి. ఆలస్యం చేయకుండా అడ్వొకేట్ యాజుల్ని కలుసుకుని అడిగాడు.

'' ఇదెలా సాధ్యం? నాకు తెలియకుండా, నా సంతకం లేకుండా, నా ప్రమేయం లేకుండా, నన్ను సంప్రదించకుండా యెలా వ్యవహారం

నడపగలిగింది? నేనుగదా తల్లిని కనిబెట్టి అంటివుండి సేవజేసింది. నాకు చెందాలే?''

అడ్వొకేట్ యాజులు సింపతీ చూపుతూ దయతో నవ్వాడు. ''కుమాతా నభవతి సుపుత్రా. నీ శ్రేయస్సు కోసం సంతకం పెట్టి పిత్రార్జితం అమ్మించి వ్యాపారానికి డబ్బు అందిస్తే ఆమెను సంప్రదించకుండా వేలం పడేట్టు చేసి మాయమైనావే. నిన్నెలా నమ్మతుంది? మంచి అవకాశం అందినప్పుడల్లా డబ్బు అందినప్పుడల్లా తెచ్చుకుని తన వ్యాపారం తానే నడుపుకున్నది. చౌకగా కొని, రిపేర్లు చేయించి, రంగులేయించి, చిన్న యిళ్లు అమ్మి లాభాలు చూసింది. ధైర్యమొచ్చింది. అలాగే ప్లాట్లు కొని లాభాలు చూసింది. ఇవి గూడా అమ్మాలనుకోలేదు. సెంటర్లో వున్నదిగదూ యిల్లు? మంచి ధరకు అమ్మమని కొంటామనీ వ్యాపారస్తులడిగారు. అలాగే పొలము. ఆ డబ్బే బీరువాలో కనుగొన్నావు. మంచి నీళ్లలాగా ఖర్చుపెట్టావు. అదంతా ఆమె స్వార్జితం. ఆమె పేరే వున్నాయి. చూపు పోతున్నదనే ఆ పని చేసి వుండాలి నరసమ్మ తల్లి. తెలివి అంటే అదే. నీ కోసమే రొఖ్కముంచింది. ఆ రొఖ్కం విలువ యెవరి చెమట అని తలచావా? కట్టుకు పోయిందా నరసమ్మ తల్లి? నీ కష్టార్జితం విలువ నీకు తెలిసేదేమో! కష్టించావా? బ్రెయినుపయోగించావా సుపుత్రా? కుమాతా నభవతి! వేలం వేయిస్తావనో, అతి చౌకగా అమ్ముతావనో తలచి అమ్మేసి వుండాలి'' అన్నాడు అడ్వకేట్.

వింటున్న సైకాలజీ ప్రొఫెసర్ స్టన్ అయినాడు.